క్లుప్తంగా

రాజీనామా చేయాలి

వైరా: జాతీయ పరీక్షలు అయిన నీట్, ఎన్‌టీఏ వంటి పరీక్ష పేపర్లు లీకయినా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న కేంద్ర విద్యాశాఖా మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ వైరా డివిజన్ అధ్యక్షుడు పుప్పాల నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం వైరాలో ఎస్ఎఫ్ఐ వైరా డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ పేపర్ లీకై పరీక్ష రద్దు చేయడం కేంద్ర ప్రభుత్వ బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమన్నారు. ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల చేతిలో ప్రభుత్వాలు బందీలుగా మారాయన్నారు. ఎన్‌టీఏ పేపర్ లీకేజీ వెనక ఉన్న కుట్ర కోణాన్ని వెలికి తీసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోట ప్రేమ్‌కుమార్, హేమంత్, అజయ్, గణేష్, ఉపేందర్, మనోహర్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం



హెచ్‌ఎం వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న వెంకటరామారావు

తల్లాడ: అన్నారుగూడెం గ్రామంలోని నిమ్మ గూడెం పాఠశాల హెచ్‌ఎం పోలూరు వెంకటేశ్వరరావు బదిలీ కాగా.. గురువారం బీజేపీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు, యువ మోర్చా మండల అధ్యక్షుడు ఎల్లంకి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఈకి వినతి

బోనకల్: మండలంలోని రాపల్లి గ్రామానికి చెందిన రైతు బిక్షారెడ్డి విద్యుత్‌శాఖ అనుమతులు లేకుండా.. అక్రమంగా స్తంభాలు తెప్పించి తన సొంత పొలంలో వేసుకున్నాడని పలువురు రైతులు విద్యుత్ ఏఈ ఉమామహేశ్వరరావుకు గురువారం వినతిపత్రం అందించాడు. ఈ సందర్భంగా రైతులు టి.ప్రభాకర్, తోట చలపతిరావులు మాట్లాడుతూ.. రాపల్లి గ్రామంలో పలుచోట్ల ఉన్న విద్యుత్ స్తంభాలను సుధాకర్‌రెడ్డి సాయంతో అక్రమంగా తరలించి వారి పొలాల్లో వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వైర్లు, సామగ్రి సైతం ఎలాంటి అనుమతి లేకుండా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆపు చేసి లైన్ కనెక్షన్ ఇస్తున్నారని తెలిపారు. తక్షణమే అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు పతకాలు బహుకరణ



విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న రిలయన్స్ ట్రెండ్స్ సిబ్బంది

వైరా: ఇటీవల జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన వైరా ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థులకు వైరాలోని రిలయన్స్ ట్రెండ్స్ వారు గురువారం అవార్డులు, మెడల్స్ బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేత్రదానం



అంజమ్మ(ఫైల్)

సత్తుపల్లిటౌన్: పట్టణానికి చెందిన చిట్టిబొమ్మ అంజమ్మ (72) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. ఆమె నేత్రాలను కొత్తగూడెం అగర్వాల్ ఆస్పత్రి వైద్య సిబ్బంది సేకరించి నేత్రనిధికి పంపించారు. నేత్రదానానికి సహకరించిన కుటుంబ సభ్యులను అభినందించారు. అంజమ్మ మృతదేహాన్ని ఎమ్మెల్యే మట్టా రాగమయి సందర్శించి నివాళులర్పించారు. అదే విధంగా కాకర్లపల్లికి చెందిన పువ్వాళ్ల సంపూర్ణమ్మ మృతి చెందగా ఆమె మృతదేహానికి సందర్శించి నివాళులర్పించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంతాపం తెలిపారు.

ఎంబీఏ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలోని ఎంబీఏ విభాగం విద్యార్థులకు గురువారం వీడ్కోలు సమావేశాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఊటుకూరు శేషారత్నకుమారి మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి ఉన్నతమైన విలువలతో కూడిన భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల మాతృసంస్థ హెటిరో కంపెనీలో ఎంబీఏ విద్యార్థులకు ప్రతి ఏటా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, విభాగాధిపతి డాక్టర కృష్ణారెడ్డి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధిర నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క
- చింతకాని మండలంలో బీటీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు



నాగులవంచలో బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, నాయకులు

చింతకాని: మధిర నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. మండలంలోని నాగులవంచ, తిమ్మినేనిపాలెం గ్రామాల్లో రూ.21.25 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్ల నిర్మాణానికి గురువారం భట్టివిక్రమార్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు లేని పేదలకు రూ.5 లక్షలతో ఇళ్లు నిర్మించే కార్యక్రమాన్ని చేపట్టబోతున్నామని, నియోజవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా తనను గెలిపించి అసెంబ్లీకి పంపిన మధిర నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. నాగులవంచ-తిమ్మినేనిపాలెం వరకు రూ.6.75 కోట్లు, నాగులవంచ-పోలంపల్లి వరకు రూ.5.50 కోట్లు, తిమ్మినేనిపాలెం-చిన్నమండవ వరకు రూ.9 కోట్లతో నిర్మించనున్న బీటీ రహదారులకు భట్టి శంకుస్థాపన చేశారు. ముందుగా నాగులవంచ గ్రామంలోని శ్రీ కోదండరామాలయంలో స్వామికి భట్టివిక్రమార్క పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి నాగలంచలో భట్టిని కలిసిన సందర్భంగా ముజమ్మిల్ ఖాన్ పూల మొక్కను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పూర్ణయ్య, ఎంపీటీసీ యాకోబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు బస్వయ్య, నబీ, శ్రీనివాసరావు, కొండలరావు, సతీష్, వెంకట్రాములు, సీతయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

క్రాస్ రెగ్యులేటర్ ఏర్పాటు చేయాలని భట్టికి వినతి..

ముదిగొండ: డీవీఆర్ నందిగామ బ్రాంచ్ కెనాల్ (16వ బ్రాంచ్‌కెనాల్) పరిధిలో ఉన్న మండలంలోని వల్లభి, మల్లారం, పెద్దమండవ గ్రామాలను ముదిగొండ సబ్‌డివిజన్‌లో కలపాలని వల్లభి ఎంపీటీసీ సభ్యుడు బిచ్చాల బిక్షం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు ఖమ్మంలో గురువారం వినతిపత్రం అందజేశారు. 8 కి.మీ మేర కాలువ తెలంగాణ రాష్ట్ర పరిధిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నీటిని విడుదల చేసిన సమయంలో మాత్రమే ఈ మూడు గ్రామాల రైతులకు సాగర్‌జలాలు అందుతాయని అన్నారు. ఈ మూడు గ్రామాల్లో 2వేల ఎకరాల ఆయకట్టు ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. తెలంగాణ సరిహద్దులో క్రాస్‌రెగ్యులేటర్ ఏర్పాటుతో పాటు యూటీలు మరమ్మతులు చేయించాలని ఎంపీటీసీ వినతిపత్రంలో పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

కారేపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ పంపిణీ చేశారు. గురువారం తహసీల్దార్ సంపత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈరోజు కారేపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన 33మంది లబ్ధిదారులకు రూ.33,03,828ల చెక్కులను అందించడం జరిగిందన్నారు.

గొడవలకు పోయి కేసులపాలు కావొద్దు..

కారేపల్లి మండలం, ఎర్రబోడు, మాణిక్యారం గ్రామాల పరిధిలో వివాదంలో ఉన్న పోడు సాగుదారుల అనవసరంగా గొడవలకు పోయి.. కేసులపాలు కావొద్దని ఎమ్మెల్యే అన్నారు. మండలవ్యాప్తంగా ఎప్పటి నుండో పెండింగ్‌లో ఉన్న అటవీ సమస్యలను పోలీస్, ఫారెస్ట్ అధికారులు, పోడుసాగుదారులతో సమావేశం ఏర్పాటు చేసి సామరస్యంగా సమస్యను పరిష్కరించుకుందామన్నారు. జర్నలిస్టుల ఇళ్లస్థలాలకు సంబంధించి తక్షణమే నివేదిక తయారు చేయాలని తహసీల్దార్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సొసైటి చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, ఎంపీటీసీ ఆళోత్ ఈశ్వరబాయినందరాజ్, ఎంపిడిఓ జి. సురేందర్, ఆర్‌ఐలు సామినేని నరసింహరావు, జార్జ్, కో. ఆప్షన్ సభ్యులు ఎం.డీ. హనీఫ్, సొసైటి డైరెక్టర్‌లు అడ్డగొడ ఐలయ్య, భానోత్ హీరాలాల్, కొత్తూరి రామారావు, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, ఎంపీటీసీ ఆలోత్ ఈశ్వరబాయినందరాజ్, ఎంపీడీఓ జి.సురేందర్, ఆర్‌ఐలు సామినేని నరసింహరావు, జార్జ్, కోఆప్షన్ సభ్యులు ఎండీ.హనీఫ్, సొసైటీ డైరెక్టర్లు అడ్డగొడ ఐలయ్య, హీరాలాల్, రామారావు, కాంగ్రెస్ నాయకులు, పోడుసాగుదారులు పాల్గొన్నారు.

ఈజీఎస్‌ను గ్రామీణ ప్రజలు వినియోగించుకోవాలి



సామాజిక తనిఖీలో సిబ్బందిని ప్రశ్నిస్తున్న శిరీష

వైరారూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం డీఆర్‌డీఏ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ శిరీష సూచించారు. వైరా మండలంలోని గత ఆర్థిక సంవత్సరంలో రూ.4 కోట్లతో చేపట్టిన ఉపాధిహామీ పనులపై గురువారం వైరాలోని మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఈజీఎస్ పనులను పంచాయతీల వారిగా సమీక్షించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో జరిగిన పనుల్లోని అవతవకలపై శిరీష్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కొంత మంది సిబ్బందికి స్వల్ప మొత్తంలో జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరస్వతి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మాది పక్షపాతం లేని ప్రభుత్వం..



ఇళ్ల పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే రాగమయి, తదితరులు

సత్తుపల్లిటౌన్: రాజకీయాలకు అతీతంగా, ఎలాంటి పక్షపాతం లేకుండా అర్హులకు మాత్రమే సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న ప్రభుత్వం తమదని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి వెల్లడించారు. సత్తుపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆమె వేంసూరు మండలం వెంకటాపురానికి చెందిన 60 మందికి డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పట్టాలను అందజేసి మాట్లాడారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మంచి మెజార్టీ ఇచ్చిన ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీకి వెన్నుదన్నుగా ఉండాలని కోరారు. రాబోయే కాలంలో ప్రతీ పథకం అర్హులందరికీ అందేలా కృషి చేస్తామన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ..

ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే రాగమయి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆమె విద్యార్థులకు మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, తహసీల్దార్ ఎంఏ.రాజు, డాక్టర్ అవినాష్‌తో పాటు నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉద్యోగులు చిరంజీవి, జంగా శ్రీనివాసరెడ్డి, కాసర చంద్రశేఖర్‌రెడ్డి, పుచ్చకాయల సోమిరెడ్డి, గొర్ల వెంకటాప్పారెడ్డి, పర్సా రాంబాబు, వెల్ది జగన్మోహన్‌రావు, ఫైజుద్దీన్, సురేష్, ప్రమీలారాణి, నర్సింహారావు, యాకోబు, షాకీర్ పాల్గొన్నారు.

హద్దులు కేటాయించాలి

కారేపల్లి: కారేపల్లిలోని హిందూ శ్మశానవాటిక ఆక్రమణకు గురవుతుందని, హద్దులు కేటాయించి, శ్మశానవాటిక స్థలాని కాపాడాలని కారేపల్లి గ్రామస్తులు తహసీల్దార్ సంపత్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నారాయణ, శ్రీను, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, రవి, రాంబాబు పాల్గొన్నారు.

తుమ్మల కృషితోనే ఎంట్రీ ఎగ్జిట్



మంత్రి తుమ్మల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేంసూరు: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితోనే వేంసూరు, లింగపాలెం గ్రామాల మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ఎంట్రీ, ఎగ్జిట్ వచ్చినట్లు సీపీఎం, కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గురువారం వేంసూరు శివారు గ్రీన్‌ఫీల్డ్ హైవేపై నిర్మిస్తున్న వంతెన వద్ద తుమ్మల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సోమిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఫైజుద్దీన్, జగన్‌మోహన్‌రావు, గోపాలకృష్ణ, వెంకటేశ్వరరావు, సురేష్, శ్రీనివాసరావు, చెన్నకేశవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

హాజరుశాతం పెంచాలి

ఎర్రుపాలెం:పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచేలా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని విద్యాశాఖ జిల్లా ప్లానింగ్ అధికారి సీహెచ్ రామకృష్ణ ఎంఈవో వై.ప్రభాకర్‌రావులు సూచించారు. గురువారం మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం జీవీఎస్ రాజు అధ్యక్షతన ఉపాధ్యాయులతో జరిగిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. పాఠశాల సూపరిండెంట్ కె.సరిత, ఉపాధ్యాయులతో మాట్లాడారు. నిర్మాణంలో ఉన్న టాయ్‌లెట్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ రత్నాకర్‌ను ఆదేశించారు. తాము చెల్లించాల్సిన బకాయిలు కూడా ఇప్పిస్తామని తెలిపారు.

22న క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలు

ఏన్కూరు: స్థానిక గురుకుల విద్యాలయంలో ఈ నెల 22న క్రీడా పాఠశాలల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ దుగ్గిరాల జయరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నాల్గో తరగతి చదువుతున్న బాల, బాలికలకు బ్యాటరీ టెస్ట్, ఏడు రకముల క్రీడా అంశాల్లో పోటీలు నిర్వహించి.. వారిని ఎంపిక చేసి ఈ నెల 27న సర్ధార్ పటేల్ స్టేడియం ఖమ్మం నందు జరుగు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనే విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతో ఉదయం 9 గంటలకు పోటీలకు హాజరు కావాలన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వయస్సు 01-09-2015 నుంచి 31-08-2016లోపు జన్మించిన వారే ఉండాలన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ

కల్లూరురూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ కార్యక్రమాన్ని కల్లూరు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో చేపట్టారు. కల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 260 మంది అంగన్‌వాడీ టీచర్లకు 21 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ టీచర్లను ఏడు బ్యాచ్‌లుగా విభజించి ఒక్కొక్క బ్యాచ్‌కు మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. కల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ మెహరున్నీసాబేగం ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైని సుజాత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి ఇందిరా ప్రియదర్శిని పుస్తకం, కరదీపిక, వాచకం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ వితరణ



కుట్టుమిషన్ అందజేస్తున్న గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: వైరా గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో గురువారం క్లబ్ సభ్యుడు గంగవరపు కిషన్‌రాయ్ జన్మదినాన్ని పురస్కరించుకుని వైరా మండలం పాలడుగు గ్రామానికి చెందిన మోదుగు మణికి కుట్టుమిషన్ వితరణగా అందజేశారు. క్లబ్ అధ్యక్షురాలు ఉంద్రు వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, ఆర్‌సీ లగడపాటి ప్రభాకర్‌రావు, తోటకూర శ్రీకాంత్, ఉయ్యూరి రామకృష్ణ, జాలా మహాలక్ష్మి, అక్షర, సిరి, చిన్న శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'మోదీ విధానాలతో ప్రజలకు నష్టం'

తల్లాడ: మోదీ ఆర్థిక విధానాలతో ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని సీపీఎం జిల్లా నాయకులు మాదినేని రమేష్, బండి రమేష్ అన్నారు. తల్లాడలో గురువారం మండల స్థాయి సీపీఎం శిక్షణ తరగతుల్లో వారు ప్రసంగించారు. కార్యక్రమంలో సీపీఎం సత్తుపల్లి నియోజకవర్గ నాయకులు బారతి, బాస్కర్‌రావు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ

సత్తుపల్లిరూరల్: మండలంలోని బేతుపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం విస్సంపల్లి మోహన్‌రావు జ్ఞాపకార్థం మిత్రులు పాలకొల్లు శ్రీనివాసరావు, నల్లంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



సత్తుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని శ్రీరామచంద్రమిషన్ మాస్టర్ కొండపల్లి పరశురాంరెడ్డి అన్నారు. సత్తుపల్లిలో గురువారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజారత్నచారి, ఝాన్సీ, శ్రీనివాసరెడ్డి, రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

సాయినాధుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురువారం అర్చకులు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజలు చేశారు. సాయినాధునికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. కర్పూర హారతులిచ్చి పూజలు నిర్వహించారు. బాబాని బక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. భజనలు చేస్తు సాయి గీతాలను ఆలపించారు. మండలకేంద్రంలోని ఆలయంలో బనిగండ్లపాడు గ్రామానికి చెందిన శీలం నర్సింహారెడ్డి-మాధవి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాయిమందిరం నిర్మాణానికి రూ.లక్ష విరాళం



సాయి మందిర నిర్మాణానికి విరాళం అందజేస్తున్న కిరణ్ కుటుంబ సభ్యులు

పెనుబల్లి: మండలంలోని యడ్లబంజర్ గ్రామంలో నిర్మాణం చేస్తున్న సాయి సేవాశ్రమం మందిరం నిర్మాణానికి గురువారం తోట వెంకటేశ్వరరావు, కిరణ్ కుటుంబ సభ్యులు లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. నిర్మాణం దశలో ఉన్న సాయి సేవాశ్రమం మందిరం గోపుర నిర్మాణానికి తోట గోపయ్య, భాగ్యమ్మ, వారి కుమారుడు వెంకయ్యల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు తోట వెంకటేశ్వరరావు, కిరణ్‌లు ఈ విరాళం అందజేసినట్లు తెలిపారు. ఈ విరాళ సొమ్మును గ్రామ పెద్దలు ఎడ్ల సుబ్బారావు, వేణుబాబు, గోపిశెట్టి సుబ్బారావుల సమక్షంలో మందిర నిర్వాహకులు జిల్లెల ప్రసాద్‌లకు అందజేశారు. కార్యక్రమంలో గోపిశెట్టి వెంకటేశ్వరరావు, జంపా శ్రీను, హరీష్, గోపిశెట్టి శివబాబు, జోగు శ్రీనివాసరావు, దత్త కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులను నివారించాలి

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యాధికారులు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారుల మాట్లాడుతూ.. నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



మధిర: విద్యార్థులకు టాబ్లెట్ వేస్తున్న జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్



వైరా: ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్



తల్లాడలో నులి పురుగుల నివారణ మాత్రలు వేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు



ఏన్కూరులో..



ఎర్రుపాలెంలో

రైతు సమస్యలు పరిష్కరించాలి



డీటీ ఎర్రయ్యకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

కొణిజర్ల: రాష్ట్ర ప్రభుత్వం రైతు సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు వడ్డె సత్యం, మేడి కొండలరావు తెలిపారు. అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం కొణిజర్ల డిప్యూటీ తహసీల్దార్ ఎర్రయ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షలు రుణమాఫీ తక్షణమే చేపట్టాలని, ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు ఉచితంగా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తడికమళ్ల సీతారాములు, కంకణాల పెద్ద వెంకటి, చింతల వెంకటేశ్వర్లు, కంకణాల అర్జునరావు, గడ్డం లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి..

గత ఐదునెలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నామని గ్రామ పంచాయతీ కార్మికులు తెలిపారు. ప్రభుత్వం తమకు పెండింగ్ వేతనాలు మంజూరు చేసి ఆదుకోవాలని ఎంపీడీఓ కార్యాలయ సూపరెండెంట్ రవికుమార్‌కు గురువారం వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు యలదండి బాబు, గండికోట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



లచ్చన్నగూడెంలో అంగన్‌వాడీ బడిబాట

వేంసూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు బాలింతలకు, గర్భిణులకు ప్రభుత్వం కల్పిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ మల్లీశ్వరి అన్నారు. గురువారం మండల పరిధిలోని లచ్చన్నగూడెంలో చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి పిల్లలను అంగన్‌వాడీ కేంద్రల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భగా సూపర్‌వైజర్ మల్లీశ్వరి మాట్లాడుతూ.. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రీస్కూల్ పిల్లలకు నూతనంగా రూపొందించాన అంశాల వారీగా టైం టేబుల్ ప్రకారం పిల్లలకు ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంగతాయి, విజయలక్ష్మి, సత్యవాణి, ఐకేపీ సభ్యులు పాల్గొన్నారు.

ఎప్పుడొస్తారు..?

- పర్యవేక్షణలో లోపం.. విధుల్లో నిర్లక్ష్యం
- సమయపాలన పాటించని ఇరిగేషన్ సిబ్బంది



కల్లూరు ఇరిగేషన్ కార్యాలయంలో సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

కల్లూరురూరల్: కల్లూరులోని జల వనరుల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరింగ్ కార్యాలయం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయాల్లో ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. కార్యాలయాల సిబ్బంది ఉదయం 10 గంటలకు విధుల్లో చేరాల్సి ఉండగా.. 11గంటల 30 నిమిషాలు అయినా విధులకు హాజరుకాలేదు. కల్లూరు జల వనరుల శాఖ ఎస్ఈ కార్యాలయంలో 22 మంది సిబ్బందికి గానూ.. కేవలం ఇద్దరు అటెండర్లు మాత్రమే సమయానికి కార్యాలయానికి చేరుకున్నారు. మిగిలిన 20 మంది సిబ్బంది జాడలేరు. వీరిలో సూపరింటెండెంట్‌తో పాటు మరో ఇద్దరు సెలవులో ఉన్నారని, మరో ఇద్దరు ఆన్‌డూటీ (ఓడీ)లో ఉన్నారని, మరోక ఉద్యోగి ఆఫీస్ పనిపై వేరే కార్యాలయానికి వెళ్లినట్లు సమాచారం. ఈ విధంగా చూసినా మరో 15మంది సిబ్బంది టైంకు రావాల్సినా.. మధ్యాహ్నం 12 గంటల దాటినా కార్యాలయాలకు చేరుకోలేదు. సిబ్బంది కార్యాలయాలకు ఎప్పుడువచ్చేది.? ఎన్నిగంటలు పనిచేసేది..? అనే విషయాలు ఎవరికీ తెలియకుండా పోతున్నాయి.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏది..?

ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది సక్రమంగా పని చేయాలంటే సంబంధిత అధికారి పర్యవేక్షణ ఎంతైనా అవసరం. కార్యాలయ అధిపతి పర్యవేక్షణ లోపం వల్లనే కిందిస్థాయి సిబ్బంది ఇష్టారీతిన ఉండే అవకాశం ఉంటుంది. ఇకనైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు, కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.